కథానిక :

తిరుగు ప్రయాణం

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

సీతా! మరి నేను సాయంకాలానికల్లా తిరిగి వచ్చేస్తాను.

సాయంకాలానికా? సినిమా చూడకుండానే వచ్చేస్తారా?

ఏమిసినిమాలు పోనిద్దూ, అన్నీ ఒక్కలాగున్నాయి. అంతగా చూడదగినదేమయినా ఉంటే రెండుగంటల ఆట చూసి, అయిదుగంటలకి బయలుదేరితే ఎనిమిదికల్లా వచ్చేస్తాను.

అదే నా భయం. డ్రయివరుకూడా లేడు. మీరు కారునడపడం అంటే ఎంతజోరుగా వెళ్తున్నారో మీకా ఆలోచనే ఉండదు. నిన్నా మొన్నా వర్షాలు కూడా పడ్డాయి; రోడ్లు బాగుండవుకూడా.

రోడ్లమీద ఏమీ బాధలేదు. రోడ్డు దిగేక మన ఊరు వచ్చేవరకూ ఈ ఎనిమిదిమైళ్లే కొంచెం చికాకు, తక్కిన డెబ్భైమైళ్లంతో ఈ ఎనిమిదిమైళ్లు అంత చికాకు. ఇంకెంత, మళ్లీ సంవత్సరం ఈసరికి పక్కా రోడ్డు వేయించకపోతారూ?

అప్పుడు మరీ రోజుకొకమారు పట్నం వెళ్లివస్తూ ఉంటారు కాబోలు. అయినా ఇప్పుడీ వెళ్ళడం అంతఅవసరం అంటారా?

ఇదుగో సీతా! చూడు. ఈసంగతి మనం ఈ ఈమధ్యనల్లా చర్చించి చర్చించి నిర్ణయించుకొన్న సంగతేకదూ. మళ్లీ అదంతా ఇప్పుడు తిరగతోడడం దేనికి? నువ్వు మరిక్కడినుండి కదలక పోవడం నిశ్చయమేకదా!

నిశ్చయమని ఏమీ లేదు. మీరు వద్దంటే దేనికయినా నేను సిద్ధమే.

అదుగో అదే నా కిష్టపడదు. నీకు ఎంతమాత్రం ఇష్టంలేకపోయినా కేవలం నాతృప్తికోసమే అన్నీ చేస్తున్నట్టు మాట్లాడితేనే నాకు కష్టంగా ఉంటుంది. ఏవిషయంలో నేను నీకు స్వేచ్ఛ నియ్యలేదు చెప్పు?

తక్కిన సంగతులమాట నేనన్నానా? ఇందులో మాత్రం నాయిష్టం కావాలంటే మీరింత అట్టహాసం చెయ్యడమే నాకదోకలాగుంది. ఈఊళ్లో మరెవ్వళ్లకీ పురుళ్లు రావడంలేదా? పిల్లలు పుట్టి పెరగడం లేదా? ఎవ్వరికీ లేనిది, ప్రత్యేకించి అవసరం అంటూ లేకుండానే పట్నంనించి పెద్దడాక్టర్లనూ నర్సులనూ తీసుకొనివచ్చి మనఇల్లే పెద్దహాస్పిటలు చేస్తామంటారు.

నేనలాగని అననేలేదు. నిన్నే తీసుకొని వెళ్లి హాస్పిటల్లో ప్రవేశపెడతానన్నాను. దానికి నువ్వు ససేమిరా వద్దంటే కనీసపక్షంగా ఇప్పుడీ పద్ధతి చెప్పాను.

మనమయినా హాస్పిటలుకి పోవాలి; లేదా, హాస్పిటలయినా మనయింటికి రావాలి. అంతే, మీ పట్టినపట్టేమీది. ఊళ్లో తక్కినవాళ్లంతా ఇలాగే చేస్తున్నారా?

నువ్వు మాటిమాటికీ ఊళ్లో తక్కినవాళ్ళంటూ ఉంటేనే నాకు కష్టంగా ఉంటుంది. ఎవరి అవసరాలూ అవకాశాలూ, అభిమతాలూ వాళ్ళవి. అందరూ ఏవిభేదాలూ లేకుండా సమానం చెయ్యబడే సుదినం వస్తే నాకూ బ్రహ్మానందమే; కాని, అంతవరకూ మనస్వార్థం మనం సక్రమంగా చూసుకోక పోయినందువల్ల ఎవరికీ మేలు చేసినవాళ్ళం కాము. మనకి మనం నష్టం కలిగించుకొంటామంతే. మన ఊళ్లో మరెవ్వరికీ లేదు. మనకి కారుంది: అందరికంటె పెద్దఇల్లుంది. వీటిని మనం వినియోగించుకొంటున్నట్టే తక్కినవీని.

మీకు పెద్దఇల్లు అవసరం; కారు అంతకంటే కూడా అవసరం.

మరి నన్ను చెప్పనీ, అలాగే నాకు అత్యంతమూ విలువయిన నీ ఆరోగ్యాన్ని సక్రమంగా కాపాడుకొందికి చేసేప్రయత్నం కూడా అత్యంతావశ్యకమే.

పూర్వం గొప్ప కొద్ది భేదం లేకుండా ప్రతివారికీ ఊళ్లో వైద్యుడిచ్చే మాత్రలతోనే సరిపోయేది. ఇప్పుడు ఎంత లేనివాళ్ళకి ఎవరో పై ఊరు డాక్టరొచ్చి ఇంజెక్షనివ్వాలి. పూర్వం ఎంత మేరయినా నడిచిపోయేవారు; ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి గనక బస్సులూ రైళ్ళూ వాడుకోలేదూ? అలాగే, అవకాశాన్ని బట్టే అవసరాలు.

మిమ్మల్ని నేను వాదించి ఒప్పించగలనా? నా యిష్టమంటే చెప్పేను గాని.

ఇష్టమని చెప్పి, మనకి విస్పష్టంగా కనిపిస్తున్న అవసరాలనూ, మనకి అందుబాటులోనున్న అవకాశాలనూ కాదనుకోంటామా? ఇంతకీ నేనేమీ చెడు ఖర్చు పెడతాననలేదే. మా స్నేహితుడు డాక్టరు రాజేశ్వరం, నా దగ్గర దమ్మిడీ ఫీజు పుచ్చుకోడు. వాళ్ళ పెద్దక్కయ్య డాక్టరు పనిచేసి ఈ మధ్యనే రిటైరయింది. ఆవిడను వీలయితే తీసుకొని వస్తాను. ఆవిడ వచ్చినా రాకపోయినా మంచి అభవమున్న ఒక నర్సును తీసుకొని వస్తాను. నర్సు అవసరం అని చెప్పగానే కారు పంపిస్తే రాజేశ్వరం కూడా వస్తాడు.

ఈ పటాటోపం అంతా చేసేకంటె పోయి గుప్ చప్ గా హాస్పిటల్లో ప్రవేశించి ఉంటేనే బాగుండిపోవును.

మరి నేను చెప్పినన్నాళ్ళు విన్నావా? ఇప్పుడు మరి లాభం లేదు. ఇక మరి ప్రయాణం అంత మంచిది కాదు. కాక అక్కడ వాళ్ళ గొడవలలో పడి శ్రద్ధగా చూస్తారు చూడక పోతారు. మరెందుకాలస్యం, నేను వెళ్ళి సాయంకాలానికల్లా వస్తాను.

అయితే మరొకగంటలో రెండుగంటలో ఆలస్యమవుతుంది గాని, కారు మాత్రం మేఘాలమీంచి పరుగెత్తించకండి మీ పుణ్యంఉంటుంది. లేకపోతే, జ్వరం తగ్గిందికాబోలు డ్రయివర్ని కూడా పక్కను కూర్చోమనకూడదూ?

“నేను అజాగ్రత్తగా తొందరగా నడిపితే పక్కనుండి అతను కాపాడేస్తాడనా? చూసేవా మరి ఇంత చిన్న విషయం, అతి సామాన్యంగా ప్రతినిత్యం జరుగుతున్నది కారులో పట్నం వెళ్లి రావడం, ఇటువంటిదానికి, నువ్వు ప్రతిమారూ ఎప్పటికప్పుడు ఇంటికి వచ్చేదాకా బెంగపెట్టేసుకుంటావు కదా: నేను నీ విషయంలో, అందులోనూ ఇటువంటి ప్రధానమయిన అంశంలో కాస్తంత జాగ్రత్త పడడం పెద్ద నేరమా? ఇందాకా నువ్వు రాసిన వస్తువుల జాబితా జేబులో ఉంది, అంతేనా మరేవేనా కావాలా?

అవే అన్నీ అనవసరం. మీరు దగ్గర కూర్చొని రాయమంటేనే రాశాను. మరెందుకాలస్యం బయలుదేరండి. ఆ వెంకన్నవయినా రానియ్యకూడదూ, సామాను కొనడానికయినా పనికివస్తాడు.

వాడా ఆ చెవిటివెధవ. ఉంటే వాడితో మాటాడ్డానికి మరింత చిక్కు-సర్లే, పోనీరానీ, కాని, నీ కెందుకింత అనుమానం. కారు జోరుగా నడిపిస్తానని. మునపటిలా గనుకొన్నావేమిటి, ముసలివాణ్ణయిపోయాను. నలభైయవ సంవత్సరం వచ్చిందికదా!

ముప్ఫై సంవత్సరాల పదకొండు నెలలకి లేని ముసలి తనం ఇంతలో వచ్చిందా? అసలు మీ సంగతి చూస్తుఉంటే రోజుకురోజూ మరింత కుర్రతనం వస్తున్నట్టుంది. అప్పుడు మొట్టమొదటి మారుగా అయిదేళ్ళ క్రితం మిమ్మల్ని తెలిసినప్పుడు ఇంతకంటె ఎంతో పెద్దలాగుండేవారు.

అది ఆ కాలంలో పరిస్థితుల ప్రాబల్యంవల్ల పుట్టిన విరక్తి. మంచిబట్ట కట్టుకోవడమన్నా, శుభ్రంగా భోజనం చెయ్యడమన్నా పెద్ద నేరంగా తోచేది.

వేషభాషలలోనే కాదు, అప్పుడు మొగంలోనే ఇప్పటికంటె ఎక్కువ వయస్సున్నట్టుండేది. కావాలంటె అప్పటి ఫోటోలకు ఇప్పటి ఫోటోలకు భేదం చూసుకోండి.

నా కనుమానం ఉంటే కదా! నువ్వు నా జీవితంలో అడుగు పెట్టడమే శాశ్వతమయిన వసంతశోభ వచ్చినట్టయింది. కాబట్టి న్యాయంగా తాతను కావలసిన ఈ వయసులో పరమోత్సాహంతో, తండ్రిని కాబోతున్నాను.

చెయ్యండి, మీ చిత్తంవచ్చినట్టు ఎగతాళి చెయ్యండి. ఇప్పుడు మీ మాటలకి నవ్వుకోవడంతప్ప, చెయ్యగలిగింది గాని, చెయ్యవలసింది గాని మరి లేదు.

నే నన్న మాటల్లో ఎగతాళి ఎక్కడుంది?

అబ్బే! ఏమీ తెలియదు పాపం— నేను అమ్మమ్మని కావలసిన ముసలివయసులో మొట్టమొదటి మారుగా తల్లిని కాబోతున్నానని వేళాకోళం చెయ్యడం కాదూ?

నా మాటలో అటువంటి సారస్యం తియ్యగలిగిన నీకు కుంచేటి కొమ్ము సంపాదించడం ఏమంత కష్టంకాదు. నువ్వేగాని విమర్శకి పూనుకొంటే ఎంత చచ్చు పుస్తకమయినా అలంకార భూయిష్ఠం కాక తప్పదు. మరెందు కిన్ని మాటలు: నా మనసులో ఏముందో నీకు తెలియనిది కాదు. నా వయసు రోజుకి తగ్గుతుందని నువ్వన్నట్టుగానే, నీ సౌందర్యం దినదిన ప్రవర్ధమానమవుతూంది— నిజమే. నీ సౌందర్యం, ఆకర్షణ అవి ఒక్క క్షణం దూరమయినా భరించ నిచ్చేవి కావు. —ఇప్పుడు నువ్వు దగ్గరగా ఉన్నా దూరంగా ఉన్నా సర్వదా మనసులో మెదలుతూనే ఉంటావు. గాని, వెనుకటి ఆ స్వంతం చేసుకోవాలనే గాభరా లేదు. అప్పటిదంతా కొత్తగా నీరు చేరిన చెరువుతీరు; ఇప్పుడు మనసు నీరు తేరి స్వచ్ఛంగా ప్రశాంతంగా ఉన్నట్టుంది.

అదే దానినే వేరేమాటలలో చెప్పాలంటే, ఇప్పుడు నేను నిజంగా నీ కక్కరలేదు. ఊరికే ఏదో భరిస్తున్నారు.

తెలిసీ తమాషా చేసేవాళ్ళకు ఏమిటి చెప్పడం. మరి మనం ఇలా మాటలు పెట్టుకొని కూర్చుంటే ఈరోజు ప్రయాణంఅయినట్టే. ఏడీ వాడు చెవిఁటి వాడు.

వాడా? వాడిందాకానే కారులో కూర్చున్నాడు.

అఁహాఁ నువ్వసలు వాణ్ణిముందే ప్రయాణానికి సిద్ధం చేసేవన్నమాట? అబ్బ ఏమి జాగ్రత్త. నిజంగా ఏమీ ప్రమాదం అంటూ రాకపోవాలే గాని, వచ్చే మాటయితే మన యీ జాగ్రత్త అంతా అడ్డుతుందా?

ఏమి మాటలు పోనిద్దురూ? మన జాగ్రత్త మీద అంత నమ్మకం లేకనే ఇంట్లో హాస్పిటలు పెట్టేస్తామంటూన్నారు కదూ మీరు? అదుగో లక్ష్మి కాఫీతెచ్చింది. మరొక కప్పు తాగేసి వెళ్ళండి. అక్కడ భోజనం ఏ వేళకి అవుతుందో.

నువ్విలా అతి గారాబం చేసి, నన్ను ఎక్కడికీ కదలకుండాచేసి పాడుచేస్తున్నావు. ఎక్కడికయినా వెళ్ళినా, మేతకివెళ్ళిన పశువులాగ, మళ్ళీ సాయంకాలానికి ఇంటికివచ్చెయ్యాలనిపిస్తుంది. మరిలా లాభం లేదు. ఈ వచ్చే జాన్యుఅరీప్రాంతిలో పిల్లవాడితో సహా బయలుదేరి, ఒక నాలుగయిదు నెలలు దేశమంతా తిరిగి రావాలి.

అప్పుడే పిల్లవాడని మీకు నిశ్చయమే నన్నమాట?

ఏదో మాటవరసకి అన్నానుగాని, ఆడపిల్లయితే నాకు మరీసంతోషం. ఎప్పుడో పెద్దయి, అత్తవారింటికి పంపించేటప్పుడు కదా కష్టం.

మగపిల్లవాడయితేమాత్రం-మనదగ్గర కూర్చుంటాడా? చదువుకొంటాడు, ఉద్యోగం చేసుకుంటాడు, తన సంసారం తాను చేసుకుంటాడు— ఇవాళికి ఆలస్యం అయినట్టుంది. రేపు బయలుదేరకూడదూ?

ఉఁహు, ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. అప్పుడే తొమ్మిదో నెలవచ్చి పదిహేనురోజులు కావస్తుందికదా.

ఎవరిపిచ్చి వారికానందం - ఏమీ లేనిదానికి పెద్ద హడావిడిచేస్తారు. పోనీ అంతే ననుకో. మరి నన్ను కదలనీ. సాయంకాలానికల్లా వచ్చేస్తాను.

రామమోహన్‌కి కారు నడపడంలోని తన జాగ్రత్తకి తనకే ఆశ్చర్యం కలిగింది. నిజమే మరి వెనుకటిలాగ కాదు, తాను చాలా బాధ్యతాయుతంగా ప్రవర్తించవలసి ఉంది. ఇక కొద్దిరోజుల్లో తాను తండ్రికాబోతున్నాడు. తన సంతతి చిన్నతనంలో తండ్రిలేకుండా పెరిగే మనుకోకూడదు. తనకోసమే కాదు, తన సీతకోసం, తన సంతతికోసం తాను జీవించవలసి ఉంది.

ఒక పదిసంవత్సరాలక్రితం ఎవరయినా జీవించవలసిన అవసరంగురించి మాట్లాడితే తనకి ఎంతో హేళనగా ఉండేది. ఆరోజుల్లో ఆత్మహత్య చేసుకోవాలనిపించిన తరుణాలు కూడా లేకపోలేదు.

కాని ఎంచేతనో నిండుప్రాణాన్ని తీసుకొనే సాహసం లేకపోయింది. అది భయమను, చేతకానితనమను, జీవితంమీద తీపిఅను, ఏదన్నా సరే, అదే తనను కాపాడింది. కాబట్టే ఈనాడింతటి వెలితిలేని ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నాడు.

తన భార్యపోయిన కొత్తలో ఎవరయినా నీకీ జీవితంలో మళ్ళీ ఇంతటి సౌఖ్యానికి సావకాశం ఉందంటే అర్థంలేని మాటలనుకొనేవాడు. జీవితమంటే ఒకటే అంధకారాద్రి కందరమనుకొనేవాడు- వెనుక-తన భార్యతో తాను పొందిన సౌఖ్యానికి తన ప్రయత్నం ఏమీ లేదు. అది సహజసిద్ధంగా ఆయా

చితంగా, వచ్చినటువంటిది. అందులో తన ప్రయత్నమూ ప్రయోజకత్వమూ ఏమీ లేవు.

కాని, సీత తనకు అంత తేలికగా లభ్యం కాలేదు. నాలుగు సంవత్సరాలు ఎదురుచూసి చూసి, మరిక లాభంలేదని నిరాశచేసుకొన్న అనంతరం తనంతట తానుగా ఒకనాడు కబురుచేసింది. అంతే అదృష్టం వచ్చేటప్పుడు ముందుగా తన రాకనిగూర్చి తెలియచెయ్యదు. హఠాత్తుగానే వస్తుంది.

గతసుమారు ఆరేళ్లకాలంలోనూ బైటిపరిస్థితులు మెరుగుగా ఉన్నా తరుగుగా ఉన్నా ఇంటిలోపలికి వచ్చే సరికి మాత్రం ఏదో అనిర్వచనీయమయిన ప్రశాంతత ననుభవిస్తున్నాడు. అదికేవలం ఆహారవిహారాదులవల్ల వచ్చినదికాదు, పరస్పరం స్తుతిపాఠాలు చేసుకోడంవల్ల వచ్చినదికూడా కాదు. అసలు ఏమి మాట్లాడనే అక్కరలేదు. పరస్పర సాన్నిహిత్యంలోనే బ్రహ్మాండమయిన తృప్తి, శాంతి. వెనుక ఏమీ చేసినా, ఎంత అనుభవించినా, ఇంకా ఏమిటో వెలితి ఉండిపోయినట్టూ ఇంకా ఏమిటో అనుభవించవలసినదీ, పొందవలసినదీ ఉండిపోయినట్టే ఉండేది. ఇప్పుడు మరి ఆ అసంతృప్తి లేదు. ఇక్కడికింతే చాలును; ఇంకా ఏమిటో, ఏమేమిటో కావాలనేది మరిలేదు.

ఈనాటికి తాను తండ్రి కాబోతాడని తానిదివరకు ఆశించనేలేదు - ఇది తనఆశలకు అతీతమయిన అదృష్టవిశేషం. మొట్టదట సీత నవ్వుతూ చెప్తే నిజమని నమ్మలేకపోయాడు.

కాని, ఇందుమూలంగా మరే కొత్తచిక్కులూ రాకుండా ఉండాలి. ఇప్పటికంతా సవ్యంగానే గడిచిపోయింది. పల్లెటూరు మంత్రసానీ, పట్నపు మిడ్ వైఫూ మరేమీ బాధలేదనే అంటున్నారు.

తన పూర్వపు దృక్పథానికీ, గత అయిదారు సంవత్సరాలలోని దృక్కోణానికీ ఏమీ సంబంధం లేదు—అయితే ఈమధ్య కొద్ది నెలలుగా తనలో ఇంకా మార్పువచ్చింది. ఇటీవలివరకూ ఇక్కడ కిది చాలును; ఇలాగే మరే మార్పులేకుండా జరిగిపోతే చాలునన్న తృప్తి మాత్రమేగాని, ఇప్పుడు మాత్రం ఆశలు మరీమరీ ఎక్కువవుతున్నాయి.

తనూ చేసిఉండవలసినవీ, చెయ్యగలిగి చెయ్యకపోయినవీ, చెయ్యలేకపోయినవీ ఎన్నెన్నో తన సంతతి చెయ్యాలి. కేవలం తనవాళ్ళు—తన శరీరాన్ని ఎంత స్వంతంగా చూసుకో గలుగుతున్నాడో అంత స్వంతంగా చూసుకోగలిగిన సంతానం! పుత్రాదిచ్ఛేత్పరాజయమ్ అనే సూక్తిలోని అర్థం అనుభవపూర్వకంగాగాని తెలియదు.

ఇంత ఉత్సాహంగా ఊరుచేరుకొన్నందుకు, రాగానే డాక్టరు రాజేశ్వరం ఊళ్ళోలేడనీ, ఏవో ముఖ్యమయిన కేసులమీద వెళ్ళాడనీ తెలియగానే మనసుకి కష్టమనిపించింది. కాని, అంతకంటె ముఖ్యమయిన విషయం ఏమిటంటే, వాళ్ళ పెద్దక్కగారు కోరడమే తడవుగా వస్తానంది. అయితే తనతో వెంటనే రావడానికి కుదరదనీ, రెండు రోజులలో బయలుదేరి వస్తాననీ అంది. ఆవిడతోపాటు రాజేశ్వరం ఏర్పాటుచేసిన నర్సుకూడా వస్తుంది.

వాడు డాక్టరు రాజేశ్వరం లేడుకదా అని తాను మొగమాట పడబోయినా ఆవిడ ఊరుకోలేదు. భోజనం కాగానే ఒక్క అరగంట విశ్రాంతి తీసుకొని బయలుదేరిపోయాడు, వేగం బయలుదేరిపోతే, చీకటి పడకుండా ఇంటికి చేరుకోవచ్చునని.

చెవిటివాడి చేతికి చీటీ డబ్బు యిచ్చి, కావలసిన వస్తువులు కొనిపట్టించుకొని తిన్నగా పెట్రోలు బంకు దగ్గరకు వచ్చి ఉండమన్నాడు.

వాళ్ళింట్లో మరొక గంట ఉంటే మధ్యాహ్నం టీ తీసుకోడము జరుగుతుంది. ఆ తరువాత కొంతసేపు గడిస్తే, సాయంత్రం భోజనానికి కూడా ఉండిపొమ్మని బలవంతం చేస్తారు. అంతకంటే ఏవో పనులున్నాయని చెప్పి బైటపడడమే మేలు. ఉన్నందువల్ల వాళ్ళకేమీ పెద్ద నష్టం కష్టం అని కాదుగాని, వాళ్ళకు అలవాటయిన దినచర్య ఆ పద్ధతిని సాగదు. ఎంతసేపూ ఎవరో అతిథి ఉన్నారనే దృష్టి ఉంటుంది—అంతకంటె వచ్చినపని అయిపోయిననంటనే బైటపడడమే ఉభయత్ర మేలు. రాజేశ్వరం వచ్చిన తరవాత నయినా ఏమీ అనుకోందికి వీలులేకుండా వాళ్ళింట్లో భోంచేసేడు. ఇక మరి ఆగడం అనవసరం.

అసలు ఇంటికి వేళ ఉందనగా వెళ్ళిపోవడం కంటె పెద్ద అవసరమయిన పని ఏమి ఉంటుంది? ఎల్లుండి ఉదయం కారు పంపిస్తే సాయంకాలానికల్లా ఆవిడా మంత్రసానీ వచ్చేస్తారు. ఆ తరవాత మరి భయం, ఆత్రత ఉండవు.

వెధవ చెవిటివాడూ, ఇంతసేపెందుకు చేస్తున్నాడో? లిస్టు వాళ్ళచేతి కిచ్చేస్తే వాళ్ళే చకచకా కట్టి పారేస్తారు. అయినా వీడు వట్టి చవటవెధవ.

వాళ్లు పీడిపని చేస్తున్నట్టే ఉండి, ఇతరపనులు చేసుకుంటూ ఉండిఉంటారు. తానే వెళ్ళిఉంటే ఇంతకంటే చాలా వేగంగా తెమిలిపోయి ఉండును. అయితే తాను వెళ్తే దుకాణాలవాళ్ళు ముఖ్యంగా బట్టల దుకాణాలవాళ్లు తనకు కావలసిన వాటికంటె అక్కరలేనివి ఎన్నో కొనిపిస్తారు. అంటే అక్కరలేనివయినా ఆనిమిషానికి ఎంతో కావలసిన వనిపించేటుగా నచ్చచెప్పగలరు. అవన్నీ మాని దెబ్బలాడడు గాని, చిన్న నవ్వునవ్వి ఊరుకొంటుంది; కాకపోతే మహా అంటే, కొత్త వస్తువులు చూసేసరికల్లా మీరు మరీ చిన్నపిల్లలయిపోతా రంటుంది.

ఈ వెధవ ఇంకా రాడేం, ఇప్పుడు తనకి ఈ రెండుగంటలఆట సినీమా చూద్దామని లేదు గాని, ఇలా చేసేకంటె అదే నయం—వీడికంటె డ్రయివరు అప్పలస్వామి అయితే ఎంతో నయం, చకచకమని పని చేసుకొనివస్తాడు.

కారులో కూర్చోడం చికాకనిపించి, దిగి, కారుమీద ఒక కాలు వేసి, నిలబడి దగ్గరలోని బస్సుస్టేండులో వచ్చిపోయే జనాన్ని చూస్తూ నిలబడ్డాడు. ఈ బయలుదేరుతున్న బస్సులు తాము వెళ్లే రోడ్డునే వెళ్తున్నాయి—అయితే తాము, చెమిటివాడు వస్తేనే గాని బయలుదేరడానికి వీలులేదు. వాడు రావడం బయలుదేరడం ఎంతో ఆలస్యంలో అయితే ఎన్నెన్ని మైళ్ళ దూరంలో కలుసుకోగలము ఇప్పుడే వెళ్తున్న బస్సుని? ఇలా ఏదో ఆలోచించసాగాడు.

అమ్మయ్య! చెవిటివాడు అడుగో సామాను పట్టించుకొని రిక్షాలో వస్తున్నాడు.

ఇప్పుడింకా రెండు పూర్తిగా కాలేదు, సినీమా చూసి వెళ్ళినా వెళ్ళవచ్చును. కాని...

"ఏఁవిఁరోయ్ రామం, ఏవిఁటి నువ్వేనా?"
—తనను ఎవ రింతచనువుగా పిలుస్తున్నారు?—

"నిన్నేరా! పలకవేం, ఓస్ పలికితే పరువు తక్కువ కాబోలు."

రామమోహన్ అతి ఆశ్చర్యంగా ప్రక్కకు తిరిగిచూసేడు. కాని, ఆ దగ్గరకు వస్తున్న గడ్డాల మనిషిని మాత్రం ఈ జన్మలో ఎన్నడూ చూసిన జ్ఞాపకం లేదు.

ఆ మురికి దుస్తులలోఉన్న గడ్డాల మనిషి దగ్గరకు వచ్చి భుజంమీద తట్టడం తనకు ఏమీ బాగా తోచలేదు. అయితే తన అయిష్టాన్ని ఏవిధంగా ప్రదర్శించడమో నిర్ణయించుకొనేలోపునే అతడు,

"ఓరి, నన్నే పోల్చుకోలేక పోయావ్రటా! పోనీ మొగంలో అంటే మార్పు ఉందిగాని, గొంతుని బట్టి అయినా తెలియలేదురా?"

"ఎవరు మీరు? మిమ్మల్ని..."

"నన్ను మన్నిస్తావేమిట్రా? నేను సోమనాథాన్ని కానూ? అవును సాక్షాత్తూ సోమనాథాన్నే; అతని భూతాన్ని కాను"—

"సోమనాథమా, అంటే అప్పుడు పదేళ్ళ క్రితం..."

"అవును. ఇల్లూ వాకిలీ సంసారమూ అన్నీ విడిచిపెట్టి వెళ్ళిపోయిన సోమనాథాన్నే—"

"నిజమే? నేను నమ్మలేకపోతున్నాను. నువ్వు లోగడ..."

"ఎప్పుడో చనిపోయేనని కూడా అనుకొన్నారుటకదూ—నీకు ఎదురుగా ప్రత్యక్షంగా నేను మనిషిని కనిపిస్తున్నా నీకు నమ్మకం లేనట్టుంది. నీ మతి సరిగానే పనిచేస్తున్నదా?"

"నా మతా? నా మతి, సరిలే గాని, నువ్వు"

"ఏమిట్రా నీ అనుమానం? అప్పుడు చదువుకొనే రోజుల్లోనూ నువ్వింతే—అతి స్పష్టంగా కనిపిస్తున్న దానికికూడా ప్రమాణమూ, ఋజువూ కావాలనే వాడివి నువ్వు. దాంతో ఒక్కొక్కప్పుడు మాష్టరికి నీమీద ఆగ్రహం పుట్టుకొచ్చేదికూడాను."

"అయితే నువ్వు నిజంగా అప్పుడు పారిపోయిన సోమనాథానివేననీ, బ్రతికే ఉన్నాననీ అంటావు?"

"నిజంగా నీ మనస్సు సరిగా పనిచేస్తుందో లేదో అనుమానించవలసిన సంగతే. ఏమోన్లే, పదేళ్ల కాలమనగా సామాన్యమా? అంతలో ఎన్ని మార్పులయినా జరగడానికి వీలు లేకపోలేదు."

"మార్పులు, ఏమి మార్పులు? ఎందుకురావాలి, ఊఁహూఁ వీల్లేదు."

"సర్లే ఏ మార్పులూ వద్దులే గాని, ఏమి టిలా నిలబడ్డావు. కారు స్వంతదారుగానా? డ్రయివరుగానా? లేక అద్దెకారయితే అందులో ఎక్కేమనిషిగానా?"

"రామమోహన్ ఏ సమాధానమూ చెప్పేలోపునే చెవిటివాడు సామానుతో వచ్చేడు. వాడికి

వినబడేలాగ అరవడం కంటె సామాన్లన్నీ సర్దుకుని హస్తసంజ్ఞతో చెప్పడమే మేలు. వాడు ఆ పనిలో ఉండగా సోమనాథం మళ్ళీ ప్రశ్నించేడు."

"ఏమిరా కారుమాట ఏమీ చెప్పావుకావు. నీ స్వంతమా అద్దెదా? సరే, ఏదయినా బాధలేదు, మీ ఊరేకదూ వెళ్తున్నావు?"

ఏమిటి కారుమాట కదూ? ఎందు కిప్పుడీ గొడవంతా."

"గొడవేమిట్రా! నీకు నిజంగా నే మతి స్తిమితంగా లేనట్టేఉంది. లేకపోతే నే నడిగినదానికి తిన్నగా సమాధానం చెప్పకుండా ఏదో అసందర్భంగా మాట్లాడుతావు. నేను ఒకటికాదు, రెండుకాదు, పదేళ్లపాటు ఇల్లూ వాకిలీ విడిచిపెట్టి పోయాను. ఇన్నాళ్ళకి మళ్ళీ తిరిగివచ్చినందుకు, ఎక్కడకు వెళ్లేను, ఏమిటి చేసేను, ఇదంతా తెలుసుకోవాలనే కుతూహలం లేకపోయిందిగాని, అడిగినమాటకు సరిగా సమాధానం చెప్పడానికేమొచ్చింది? నీకుతోడు, ఈ మనిషి ఒకడు మూగివాడిలాగ ఉన్నాడు. తగినవాడే దొరికాడులే. అసలు సంగతి చెప్పు, ఇప్పుడెక్కడికి బయలుదేరుతున్నావు? మీ ఊరికేనా?"

"ఊరికి కాకపోతే అడివికి వెళ్తున్నాననుకొన్నావా?"

"ఏమోన్లే నీ వ్యవహారం చూస్తే అలాగే ఉంది. పోనీ ఈ ఒక్క మాటయినా సరిగా చెప్పావు. మరొక్కమాట అడుగుతాను, అది కూడా సరిగా చెప్పు—పదిసంవత్సరాల తరవాత ప్రపంచం దూరంనించి చూసినప్పుడు ఎంతో పెద్దదిగా మారినదిగా కనిపిస్తుంది తప్ప, దగ్గరగా వెళ్ళి పరీక్షగా చూస్తే, అంతా ఒక్కటే, మనం మామూలుగా చూసే లోటుపాట్లు, సంకుచితత్వము మరొక రూపంలో, కాస్త డిగ్రీ భేదంతో ప్రతిచోట కనిపించేవే—నిజమయిన సుఖమూ ఆనందమూ అన్నవి మనిషి భావనలోనే ఉన్నాయి. ఆ భావనని తెవది అన్న చిన్న కుటుంబకూటం పెంపొందించగలిగినట్లుగా మరే పరిస్థితులూ వాతావరణమూ పెంపొందించలేవు. మనం ఇళ్ళలో ఉన్నప్పుడు స్వేచ్ఛ, స్వాతంత్ర్యమూ లేవని ఎంతో గునుస్తూ ఉంటాము, గాని, ఎక్కడికి వెళ్ళినా ఏవో కొన్ని కట్టుబాట్లకి లొంగుబాటు తప్పదు. సర్లే, ఇప్పుడు నా అభిప్రాయాలమాటకేం, ఇటీవల నాకు అతిగా సమయంసందర్భంలేకుండా మాట్లాడడం అలవాటయిపోయింది. నీకు ఒక్కమాటుగా ఎక్కువ మాటలు వింటే అర్థంకాక గాభరాఉన్నట్టుంది. సరే అసలు సంగతికి వద్దాము. అద్దెదికానీ, స్వంతంకానీ, ఈ కారు ప్రస్తుతం నీ యాజమాన్యంలో ఉన్నట్టుంది. నాకు ఇందాకా రైలుతప్పిపోయింది. మళ్ళీ రాత్రి పదిగంటలవరకూ రైలు లేదు. దిగి పదిమైళ్ళునడవాలి. ఈలోపుని మూడు అంచీలమీద చెయ్యాదగిన బస్సు ప్రయాణం ఉందంటే ఆ బస్సుకూడా ఇప్పుడే పది నిమిషాలక్రిందట వెళ్ళిపోయిందట. మళ్ళీ బస్సుగంట దాటేకగాని లేదు. అందుచేత నువ్వుగాని, ఇప్పుడు మీ ఊరికి బయలుదేరేమాటయితే, దారిలో నన్ను మా ఊరిదగ్గర విడిపెట్టేస్తావని......

"కారులో తీసుకెళ్ళమనేనా ?"

"అదే, అంతే కొన్నికొన్నిమాటలు సరిగానే బోధపడుతున్నట్టున్నాయి. మరేం భయపడకు; నన్ను ఊరికే తీసుకొని వెళ్ళక్కర్లేదు. కావాలంటే బస్సు టిక్కట్టిచ్చేస్తాను. లేదా నువ్వు అద్దెకు తీసుకొంటే, ఈ ప్రయాణానికయినదాంట్లో సగం ఖర్చిచ్చుకొంటాను."

"డబ్బెవరికి కావాలి? కార్లోతీసుకొని వెళ్ళినందుకు డబ్బుపుచ్చుకుంటానా ?"

"పుచ్చుకో, పుచ్చుకోకపో, అది వేరే సంగతి. నన్ను తీసుకొనివస్తే చాలును."

"తీసుకొనివెళ్ళడమా ? అదెలాగ ? నాకింకా, చాలాపని ఉంటే–"

"మరి ఇందాకా ఇప్పుడేబయలుదేరుతున్నావా అంటే ఊరుకొన్నావు ?"

"ఏమోగాని, నాకింకా ఇక్కడ చాలా పనులున్నాయి. తెమిల్తే రాత్రి ఏ పదిగంటలకో బయలుదేరుతాను. లేకపోతే, రేపుదయమో ఎప్పుడో వెళ్తాను."

"సర్లే నీకు మాట్లాడ్డం కష్టంగా ఉన్నట్టుంది, మరేమీ సమాధానాలు వాడక్కర్లేదు. నాకోసం నీ పనులేమీ పాడుచేసుకోకు. ఈ సాయంకాలంలోగా ఏదయినా బస్సు బయలుదేరుతే వెళ్తాను. ఆ తరువాత మళ్ళీ బస్సు అందుకొని, మూడు అంచీలమీద ప్రయాణంసాగిస్తాను. అంతకంటె రాత్రి పదిగంటల రైల్లో వెళ్తేనే వేగం వెళ్ళవచ్చునేమో? కాని, తీరా ఇన్నాళ్లతరువాత, ఇన్నేళ్ళు గడిచేక, ఇంటిముఖం పట్టేక సుమారు వెయ్యిమైళ్ళదూరంనుండి వచ్చి, ఈ

కొంచెందూరానికి ఇంత ఆలస్యంకావడం ఎంతో కష్టంగా ఉంది. అయితే అవతలఇంటిని చేరుకోక పోయినా, ఏదో కదుల్తూఉంటే మనస్సుకి కొంత తృప్తిగా ఉంటుంది. సర్లే మరెందుకు నీ కాలస్యం? నీకేదో పని తొందరగాఉన్నట్టుంది; వెళ్ళు."

ఎక్కువ ఆలస్యం చెయ్యకుండానే రామమోహన్ కారు నడిపించాడు... కాని తీరా బయలుదేరినతరువాత, ఎక్కడికి వెళ్ళడం? ఏమిటి చెయ్యడం?

ఏమీ తోచక హోటలు దగ్గరగా ఆపాడు. వెళ్లి కూర్చున్నాడు, కాని, ఏమీ తినాలనీ తాగాలనీ అనిపించలేదు. అయినా యాంత్రికంగా ఏదో తీపిసామానుతిని కాఫీతాగి వచ్చి కార్లో పడ్డాడు.

చెవిటివాడికి మనమాటలు తిన్నగా వినబడవు గాని, తానుమాత్రం బాగానే మాట్లాడగలడు. మళ్ళీ కారు స్టార్టు చెయ్యబోతూఉండగా అన్నాడు. "బాబూ మరింకేమీ కొనక్కర్లేదుకదా. ఇప్పుడు బయలుదేరితే సాయంకాలం అయిదుగంటలకల్లా ఇంటికెళ్లిపోతాం బాబూ" అన్నాడు.

నిజమే వాడలా అనుకోడంలో పొరపాటేమీ లేదు. అరగంట క్రితం వరకూ తానూ ఎంత తొందరగా ఇంటికి చేరుకోగల-ననే తహతహ పడ్డాడు. కాని, మరి అరగంటలోనూ అంతా పునాదులలో నుండి మారిపోయింది. తాను వెనుకటి రామమోహన్ కాడు - తానేకాడు, తన పరిసరాలు, సమీప వ్యక్తులు ముఖ్యంగా సీత సంపూర్ణంగా మారిపోవాలి.

అసలిప్పుడు చేయవలసినపనేమిటి? కింకరణీయం? కిమకరణీయం?" అబ్బ ఏమిటిలా చమట పోస్తున్నది ఎక్కడో ఒకచోట కాస్తసేపు కూర్చొని, శాంతంగా నిదానంగా ఆలోచించాలి. ఎక్కడ కూర్చోడం, ఏమిటి చెయ్యడం?

ఎటో నిశ్చయం లేకుండానే కారు నడిపించసాగాడు. పోలీసువాడు నిలవేసిన అరక్షణంలోనూ ఎదుటిగోడమీది సినీమాపోస్టరు కనబడి తాత్కాలికంగా కార్యక్రమాన్ని నిర్ణయించింది.

సినీమాలో కూర్చున్నంతసేపూ భూతభవిష్యద్వర్తమానాలు కూడా పెనవేసుకొని, ఏది నిజమై ఏదో బలమైనదో నిర్ణయించుకోబడనట్టు తయారయాయి—ఎదురుగా చూస్తున్న సినీమా ఎప్పటికప్పుడు బొమ్మలు కనిపిస్తున్నాయి. మాటలు వినిపిస్తున్నాయి, అర్థమయినట్టే ఉంటున్నాయి. కాని, రెండునిమిషాలక్రితం జరిగిన ఘట్టమేమిటో బోధపడకుండా ఉంది. అలా చూస్తూనే ఒకక్షణంలో పదేళ్లక్రితం తనభార్య పోయినరోజుల్లో ఒంటరిగా జీవితమంతా మౌనంగా గడపదలచిన మనిషిగా రూపించేవాడు. అంతలోనే తాను ఇంటికివెళ్లడం, ఇంటివగ్గర సీతతో ఆప్యాయంగా కబుర్లు చెప్పుకోడం, డాక్టరమ్మ నర్సు రావడం, సీతకు కొడుకు పుట్టేడని ఎవరో వచ్చి చెప్పడం - ఇదంతా తనకళ్లఎదుట సినీమాలాగే జరుగుతున్నట్టే కనిపిస్తోంది. అచ్చుపడిన కాగితంమీద అడ్డంగా మళ్ళీ అచ్చు పడినట్టుగా, తాను వెళ్ళిన కొద్దిక్షణాలకే వాడు సోమనాథం రావడం, పెద్ద హంగామా జరగడం, ఊళ్లోవాళ్లందరూ మూగడం, మామూలుగా తనతో మాట్లాడడానికి కూడా జంకే మనుష్యులు తనకి వ్యతిరేకంగానూ అనుకూలంగానూ తీర్పుచెప్పడం ఇదీ జరుగుతున్నట్లుగానే కనిపించేది. మరోకమూలనుండి, తానింటికివెళ్లి హాయిగా భోంచేసి నిద్రపోయిన సందర్భంలోవాడు వెళ్ళి ఊళ్లో సంగతంతా కనుక్కొని, తిన్నగా ఏదో కర్రోకత్తారో పట్టుకొనివచ్చి నిద్రలో ఉండగానే ఫైసలా చెయ్యవచ్చును. అపనే తానే స్వయంగా చేస్తే - ఛఛ, తనచేతులను ఎంతమాత్రం మలినం చేసుకోరాదు. ఈ విషయంలో ఇంతవరకూ తానేమీ తొందరపాటు పనిగాని, ఒకరికి కష్టం కలిగించేపనిగాని చెయ్యలేదు. పూర్తిగా నూటికి నూరుపాళ్ళు ఆమె ఆమోదంతోనే ఆమెను చెట్టపట్టాడు. అందులోనూ తను సుఖపడాలని ఎంతగా ఉందో అంతకంటెకూడా, చిన్నతనంలోనే వాడిపోయిన ఆమె జీవితలతకు పునర్వికాస వాసనాభాసురతను చేకూర్చాలనే భావం కూడా ప్రబలంగా ఉంది. కాకుంటే, తాను పెళ్ళిచేసుకోవాలంటే, మరెక్కడా అందమయిస్త్రీలే దొరకకపోయారా? సుమారు నాలుగేళ్లు ఆమె ఆమోదంకోసం ఎదురుచూడవలసిన పనేమి?

కాకపోయినా ఇల్లూ వాకిలీ, చదువూ సంస్కారమూ అన్నీ ఉండి, ఏదో ఘనకార్యం చేసి, బుద్ధభగవానుడిలా ప్రపంచాన్నంతటినీ ఉద్ధరిద్దామని పోయిన మనిషి మళ్ళీ ఈనాటికి ఈవిధంగా తిరిగి రావడమా? అంతగా తిరిగి రావాలంటే ఒకటి రెండేళ్ళలో తిరిగివస్తే ఎవరు వద్దన్నారు? ఒకటి కాదు, రెండు కాదు, నాలుగేళ్లయినా రాని మనిషి, ఉత్తర

మయినా రాయని మనిషి, అధమం తాను ఎక్కడో ఒకచోట ఉంటున్నానని తెలియజెయ్యని మనిషి, తాను చచ్చిపోయి ఉంటాడని సైతం ఊహించడానికి వీలుకలిగించిన మనిషి—అటువంటివాడికి ఒక దశ అనంతరం ఇప్పుడిలా హఠాత్తుగా ఆకాశంమీద నుండి, పిడుగుపడ్డట్టుగా ఊడిపడడానికి గల హక్కేమిటి?

ఒక మనిషిని తానే సర్వస్వం అని నమ్ముకొన్న మనిషిని, ఏమవుతుందో అన్న ఆలోచన లేకుండా విడిచిపెట్టి, బ్రతుకంతా దుఃఖభాజనంచేసి, చిట్టచివరికి ఎలాగో కాస్త ఆనందరేఖలు పొడసూపే సమయంలో మళ్ళీ వచ్చి రెండు నిండు జీవితాలను నాశనం చెయ్యడానికి ఏ మనిషికి మాత్రం హక్కుందుకుండాలి?

తన మాటకేంగాని, అసలిప్పుడు సీత గతి ఏంగావాలి? అతడు వచ్చి ఆమె నాదంటే, విడిచిపెట్టవలసినదేనా? ఆమెను అతడు ఎన్ని హింసలు పెట్టినా చూస్తూ ఏమీ చేతకానట్టు ఊరుకోవలసిందేనా? అంతే, తనకు నోరెత్తి మాట్లాడ్డానికి హక్కు లవలేశమూ లేదు.

అంతేనా? హక్కు లేదనీ, చేతకాదనీ, ఏది ఎలా జరిగితే అలా జరగనీ అని చూస్తూ ఊరుకోవలసిందేనా? అంతటి అశక్తుడా తాను?

ఏమి, ఎందుకు ఊరుకోవాలి? తన చేతులలో బలముంది; ధనముంది; పలుకుబడి ఉంది. కోర్టులూ శాస్త్రాలూ వీటి లెక్కను తన పక్షానికి ఎంత బలమున్నా లేకపోయినా, ఆత్మసాక్షిగా తనపట్ల న్యాయం ఉంది. మరయితే తానెందుకు ఏమీ చేతకానివాడుగా ఊరుకోవాలి?

చెయ్యడానికేముంది? ఏదో ఒకటి చెయ్యవచ్చును. కాని, ఏం చేసినా చెయ్యకపోయినా ఈ పరిస్థితిలో సీత మనస్సును కల్లోలపరచడమే అవుతుంది. అందులో ప్రస్తుతపు సున్నితమయిన స్థితిలో-ఇప్పుడు సోమనాథాన్ని గూర్చిన ఆలోచనే ఆమె మనస్సుకి రాకూడదు—అందుకేమిటి సాధనం?

ఒక్కటే వీలుంది—ప్రమాదమయినా సరే, ఇప్పటికింకా బాధలేదు—మంత్రసానితో సహా ఆమెను బయలుదేరించి, కొంతకాలంపాటు ఆమెను ఎక్కడికయినా తీసుకొనిపోవాలి. రాత్రికి రాత్రి బలవంతంచేసి, దూరంగా తీసుకొనిపోయి, ఎవ్వరికీ తెలియకుండా ఏ హాస్పిటల్లోనయినా ప్రవేశపెడితే-తన సంతానం అయినా దక్కుతుంది. అంతకంటె సీత తనకు వెయ్యిరెట్లు ముఖ్యమే—ఆమె తనదిగానే ఉండడానికి మానవమాత్రుడికి వీలయిన ప్రయత్నమంతా చేస్తాడు. కాని అప్పటికీ దైవం ఎదురు తిరిగినా, ఆమె ప్రతిబింబంగా చేసుకొందికయినా తన సంతానం తనకు దక్కుతుంది.

అంతే మరిగత్యంతరం లేదు. వెంటనే సీతను తీసుకొనిపోయి, ఎవరికీ తెలియకుండా కట్టుదిట్టాలు చేసి, హాస్పిటల్లో ప్రవేశపెట్టాలి. ఇంట్లో ఉన్న డబ్బు ప్రస్తుతానికి చాలును. ఈలోగా వాడు తనకి భయపడి పారిపోయేననుకొంటే అనుకోనీ, ఏ అపకీర్తి అయినా సరే, సీత హాయిగా ఉండి, క్షేమంగా ప్రసవించడం తనకు ప్రధానం.

అంతకంటె, అబ్బే ఆమె మనస్సు క్షోభపడకుండా ఉండాలంటే సాధనాంతరం లేదు...హుఁ, ఇటువంటి సమయంలో ఒక్క నిమిషంకూడా అమూల్యంగా లెక్కించవలసిన ఈ సమయంలో తాను తీరుబాటుగా కూర్చుని, శుద్ధచచ్చు సినీమాలోని హాస్యనామక ప్రదర్శనని చూసి సంతోషించబోవడం కంటె హాస్యాస్పదమయిన సంగతి ఇంకేముంటుంది?

దిగ్గన లేచి చరచరా అవతలికి వెళ్ళాడు. కారు తీసి స్టార్టు చెయ్యబోతూ ఉండగా చెవిటివాడిమాట జ్ఞాపకం వచ్చింది. కాని, వాడికోసమని కొంతసేపు ఆలస్యం చెయ్యడం మంచిదికాదని, కారుని సవ్యంగా తిప్పేడు. అంతలోనే లోపలినుండి పంచీ సర్దుకొంటూ వచ్చాడు వాడు. వాడికి కారు చప్పుడు వినిపించిఉండదు. కాని, వాడు ప్రతిక్షణం వెనక్కి తిరిగిచూస్తూనే ఉన్నాడు. బాబు సీటులో లేకపోవడంచూసి, వాడూ బైటికివచ్చాడు వాడిని ఎక్కి కూర్చోమని సంజ్ఞచేసి, కారు నడపడం మొదలు పెట్టాడు—

పట్టణం మధ్యలోనే కారు చాలా జోరుగా పోతున్న సంగతి చెవిటివాడికి తెలుసును—కాని, బాబుగారి సంగతికూడా బాగానే తెలుసును. అయినా ఉండబట్టక, కొంచెం ముందుకివంగి, “మన డ్రయివరు కాళీగోడ్లమీదకూడా ఇంత జోరుగా వదలడం ప్రమాదం అంటాడు.” అన్నాడు—

“ఇవాళ ఇదేం స్పీడుచూసేవు, ఇంకా ముందు ముందుంది” అన్నమాట వినబడకపోయినా ధోరణిని బట్టి వాడికి ఏదో అర్థమయినట్టే ఉంది. మొదల

కుండా వెనక్కి చేరగిలబడి మనసులో, ఏదో ప్రార్థన కాబోలు, గొణుక్కో సాగాడు—

ఊరుదాటేక వాడు భయపడినట్లుగానే కారు వేగం మరీ ఎక్కువయింది. బాబుగారు రావడాన్ని చూడకుండా ఉంటేనే బాగుండిపోవును, చూసి తాను ఊరుకోలేడు—కొన్ని కొన్ని మలుపులు తిరిగిన సందర్భంలోనూ, ఎదురుగా బళ్ళూ అవీ వచ్చినప్పుడు, సరిసరి ఏదో ప్రళయం మూడిందనే అనిపించేది. కాని, అంతలోనే ఎంతోదూరం తాము ముందుకి సాగిపోయి ఉండేవారు.

అదేమిటి చెప్మా, ఏదోబస్సు రోడ్డు మధ్యను నిలబడిపోయింది, మనుష్యులందరూ రోడ్డుమీద అటూ ఇటూ తిరుగుతూ ఉన్నారు.

రామమోహన్ మొదట తిన్నగా సాగిపోవాలనే చూసేడు. కాని, బస్సు మనుష్యులు ఎదురుగా నిలబడి అడగడంవల్ల ఆగక తప్పిందికాదు. వాళ్ళకి కావలసిన సామానులలో కొన్నే తన కారులో ఉన్నాయి.

అంతా బాగానే ఉందిగాని, తాను ఎవరినయితే తప్పించుకోందికిలా మేఘాలమీద వెళ్తున్నాడో ఆ మనిషినే తన కారులో తీసుకొనివెళ్ళడం తప్పనిసరయింది—స్థలం లేదనడానికి అవకాశంలేదు—పైగా ఆ బస్సు బాగయి వెళ్ళినా మరి ఎనిమిది మైళ్ళలో ఆగిపోతుంది. అక్కడ కనెక్షను బస్సు ఈపాటికి బయలుదేరిపోయి ఉంటుంది. అతడి తాపత్రయంకంటె బస్సువాళ్ళ సిఫార్సు ప్రబలమయింది—

దైవం అను, విధి అను, కర్మ అను, అది అడుగడుగునా అడ్డు తగలడం అంటే ఇదే. సరిగా ఈ బస్సు ఇక్కడెందు కాగిపోవాలీ? మరి కొద్ది మైళ్ళు సక్రమంగా సాగిపోయి ఉండకూడదా? అక్కడ కనెక్షను బస్సు దొరకదు—దొరికినా అంతకంటె చాలా ముందుగానే తాను ఇల్లుచేరుకొని తిరుగుప్రయాణం సాగించడానికి వీలుండి ఉండేది.

అంతా ఈ చిన్న అడ్డంకితో తారుమారయిపోయింది. వాళ్ళ ఊరు ఒక రెండు మైళ్ళు ముందే గనుక, అక్కడ దిగి, వెంటనే సంగతి సందర్భాలు తెలుసుకొని,తత్ క్షణమే దాడి వెడలవచ్చును—అటువంటి సావకాశం వాడికి చేజేతులా తానే కల్పిస్తున్నాడు—ద్వంద్వయుద్ధ మర్యాదలలో అవతలివాడు నిరాయుధుడైనప్పుడు, వాడికి ఆయుధం అందించి మరీ యుద్ధం చెయ్యడం తనకు చిన్నతనంలో అర్థమయేది కాదు—అంతకంటె అర్థం కాకుండా అసందర్భంగా ఉంది, తాను ఎవరివద్దనుండి పారిపోదలచుకొన్నాడో, ఎవరికంటె కొద్ది క్షణాలయినా ఇంటికి ముందుగా వెళ్ళడం అవసరమనుకుంటున్నాడో ఆ మనిషినే తనతో పాటు హాయిగా కారులో తీసుకొని వెళ్ళడం—

ఏం చేస్తాం, మరి తప్పేదికాదు, ఇంతే కాబోలు కర్మఫలం అంటే.

ఉదయం ఈదారిని వెళ్ళేటప్పుడు ఎంత నిదానంగా ఎంత జాగ్రత్తగా వెళ్ళేడు తాను. అప్పుడు తనలో ఎన్నో చిగుళ్లు, మొగ్గలూ, పువ్వులూ ఉండేవి. ఇప్పుడు తనకింక మిగిలిందేమిటి? నలుగురిలోనూ అవమానమూ నగుబాటూ తప్పిస్తే—"సంభావితస్య చాకీర్తి ర్మరణా దతి రిచ్యతే"(అందరిలోనూ గౌరవింపబడినవానికి అపకీర్తి మరణముకన్న హెచ్చైనది) అన్నాడు భగవద్గీతలో. నిజమే, ఈ రకమయిన అపకీర్తి అవమానంకంటె మరణమే మేలు—

కారు ఉండుండి విపరీతమయిన వేగాన్ని అందుకొంటూంది; అంతలోనే మళ్లీ రెండెడ్లబండీలాగయిపోతూంది. సోమనాథానికి తన ఇందాకటి అనుమానం నిజంగానే తోచింది. రామమోహన్ మనస్సు స్థిమితంగా లేదనడానికి ఇంతకంటె ఏమిటి తార్కాణం కావాలి? కొంతసేపు చూసి చూసి మరి భరించలేకపోయాడు. నెమ్మదిగా అన్నాడు. "రామం నిజంగానే నీవంట్లో బాగున్నట్టులేదు. నువ్వు వెనక్కిపోయి విశ్రాంతిగా కూర్చో, నేను కారు నడుపుతాను అన్నాడు.

ఆమాట ఏమీ అర్థం కానట్టుగా ఒక్క క్షణం మొగం పెట్టి, తరవాత, 'సరే' అని కారును హఠాత్తుగా ఆపి, చెవిటివాణ్ణి కూడా ముందుసీటులోకి పొమ్మని, వెనక సీటులో సుమారు పడుక్కొన్నట్టుగానే కూర్చున్నాడు సగం కన్ను మూసుకొని.

సోమనాథం కారును అతి చాకచక్యంగా నడిపించుకు పోతున్నాడు. మైలురాళ్లు చకచకా పరుగెత్తుకొనివచ్చి వెనక్కు వెళ్ళిపోతున్నాయి. ముప్పై, ఇరవైతొమ్మిది, ఇరవైఎనిమిది...... ఇరవైనాలుగుకూడా దాటిపోయింది. అంతే. ఇరవైమూడు అల్లంతదూరంలో ఉండగానే అటునుండి జోరుగావస్తున్న ఒకలారీకారూ ఢీకొన్నాయి. మరొక అరగంటలోవచ్చిన ఇంకొకలారీమాసి, అక్క

డికి దగ్గరి లోకల్ ఫండు హాస్పిటలుకు చేరవేసింది క్షతగాత్రులనూ హతులనూ. అక్కడనుండి ఆ తెల్లవారుజామునే తీసుకొనిపోయారు పట్నంలోని పెద్ద హాస్పిటలుకు దెబ్బలుమాత్రమే తగిలివచ్చిపోకుండా ఉన్న వాళ్ళను—

అందరిలో తక్కువదెబ్బలతో బైటపడినవాడు చెవిటివాడు.

తలమీద బలమయిన గాయాలు తగలడంవల్ల రామమోహన్ బ్రతుకుతాడని మొదట నమ్మకంలేకపోయింది. కాని, క్రమంగా కోలుకొంటున్నాడు.

అతనికి బాగా తెలివివచ్చి చూచేసరికి ఎదురుగా సీతకూర్చునిఉంది ఒళ్ళో పసిపాపను పెట్టుకొని. —అతనికి ఎక్కువ ఆలోచించవలసిన శ్రమ కలగకుండా, "మీరు ఇక్కడ ప్రవేశపెట్టబడ్డాక, ఆవిడ డాక్టరుగారి అక్కగారు చెప్పినప్రకారంగా నేనూ ఇక్కడే ప్రవేశించాను. ఇదుగో మీకొడుకు, అంతా మూడుమూర్తులా మీ పోలికే చూచుకోండి." అని చూపించింది.

రామమోహన్ వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాడు. అతనికళ్ళు నీళ్లతో నిండిపోయాయి. ఎలాగో సర్దుకొని, "వేళకు నావల్ల నీకు మరింత మానసిక వ్యథ, శారీరకశ్రమ కలిగాయన్నమాట?" అన్నాడు.

"లేదులేదు నాకే శ్రమాలేదు. మీరు మొదట్లో నేను హాస్పిటల్లో పురుడు పోసుకోవాలన్నారు. ఆ ప్రకారమే జరిగింది. నాగురించి నాకేమీ విచారంలేదు - గాని, మొన్నటివరకూ పెద్దడాక్టరుగారు మీమాట ఏమో నిశ్చయంగా చెప్పలేమనే అనేవారు. ఒకవేళ ప్రమాదం తప్పినా దృష్టిపోయినా పోవచ్చునన్నారు. ఏదో, భగవంతుడిదయవల్ల నా అదృష్టం బాగుంది. మీరు ఆవేళ బయలుదేరిన దగ్గరినుండి నా మనసు అదోకలాగు అయిపోయింది. అందుకు తగినట్లుగానే జరిగిందికూడా. మీరుకాస్త లేచి తిరగ్గానే చెల్లించవలసిన నాకోరిక ఒకటిఉంది. అదికారు అమ్మివేయడం.

"నీకంత కోరికగా ఉంటే కాదంటానా? అయినా జరిగినదానికి కొంతవరకు మాత్రమే నేను బాధ్యుణ్ణి. నేను నడపడం మానేసి, ఇంకొకమనిషిని నమ్మి అతడికి నడిపేపని అప్పగించడంవరకు నాదే పూచీ - ఆ తరవాత మాత్రం ఏమి జరిగిందో లేదో నాకసలు తెలియనే తెలియదు.

"ఆగోడవంతా చెవిటివాడు చెప్పాడులెండి. మొత్తానికి అందరిలోనూ ఏమీ ప్రమాదకరమయిన దెబ్బలు తగలకుండా బైటపడ్డవాడు వాడొక్కడే - అయితే మీరిద్దరే వెళ్లారుకదా, ఎవరండీ ఆ మూడవ మనిషి? గడ్డాలూ అవీ ఉండేవట, పాపం తక్కిన వాళ్లలాగ హాస్పిటలుకి చేర్చేవరకూ నయినా బ్రతకలేదట - ఆ రెండవ లారీ వచ్చేసరికే పోయాడుట.

నిజానికి అతనేమీ అందరికీ ఈగతి పట్టడానికి కారణం యేమో? ఉహుఁ ఏమిటి జరిగిందో, ఎవరిది పొరపాటో నాకేం తెలియదు, అక్కడే పోయాడా? ఎవరో తెలిసిందా?"

"ఏమిటి మీకూ తెలియదా? అందరూ మీకు తెలుసు ననుకొంటున్నారు."

"ఎవరికీ తెలియదన్నమాట? నాకు సరిగా తెలియదు. ఎవరో ఉత్తరాది మనిషనుకొంటాను. దారిలో తానెక్కిన బస్సు చెడిపోతే, కారులో కొంతదూరం తీసుకెళ్ళమంటే సరేనన్నాను. తరవాత నాకు వంట్లో కొంచెం చికాకుగా ఉండి, తాను బాగా కారు నడపగలననీ, నడుపుతాననీ అంటే అలాగే కానీ అన్నాను. నేనూ చూసినంతమటుకు అతని నడపడంలో పొరపాటేమీ లేదు.

"పాపం, ఎవరో ఊరూ పేరూ తెలియకుండానే పోయాడు—అతనికి కావలసిన వాళ్లెంత బాధపడతారో?"

"ఏమో అసలు, పాపం, కావలసిన వాళ్లంటూ ఉన్నారో లేరో? ఏడీ బాబు సరిగా చూడనీ, ఏమో, నా పోలికో నీ పోలికో నాకేం తెలియడంలేదు—మనమింకా ఇక్కడ మరెన్నాళ్ళుండాలి?"

"నేనట్టే అక్కర్లేదుగాని, మీరుమాత్రం మరొక పదిపదిహేను రోజులుండాలనుకుంటాను."

"అయితే అబ్బాయికి పేరేం పెడదామంటావు?"

"మీరేదంటే అది. కాని, మీరు ఎక్కువ మాట్లాడడం మంచిదికాదట. కళ్ళుమూసుకొని పడుకోండి. ఈ పక్కగదే నాకు ఏర్పాటు చేశారు డాక్టరుగారు. వెళ్తాను. పడుకోండి. తరవాత మళ్ళీ వస్తాను.